ఆంధ్రజ్యోతి ***
ANDHRAJYOTHY
నల్లగొండ
5
సోమవారం 20 మే 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980


నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.169	245	279
సూర్యాపేట	రూ.165	250	280
నల్లగొండ	రూ.166	252	286

ఉష్ణోగ్రత గరిష్ఠం 38.5 । కనిష్ఠం 24.0



ప్రమాదాలు స్పాట్ పెడుతున్నాయ్

65వ నెంబర్ జాతీయ రహదారిపై రోజు రోజుకూ ప్రమాదాలు పెరుగుతున్నాయి. అతివేగం.. అజాగ్రత్త.. రాంగ్ రూట్ ప్రయాణంతో అమాయక ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. మద్యం మత్తులో వాహనాలను నడపటం, సిగ్నల్ రూల్స్ పాటించకపోవటంతో ప్రమాదాల తీవ్రత పెరుగుతోంది. ఆటోలు, ట్రాక్టర్లకు ఇండికేటర్లు లేకపోవడం, గ్రామాల సమీపంలో అండర్ పాసింగ్‌లు నిర్మించకపోవడంతో ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. పశువులు రోడ్డు మీదకు రావటం, ద్విచక్రవాహనాలపై వెళ్లేవారు రోడ్డు మార్జిన్‌లో వెళ్లకపోవటం, వాహనాలు యూ టర్న్ తీసుకునే సమయంలో నిర్లక్ష్యం వహిస్తుండడంతో ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. రహదారిపై ప్రతీ మూడు కిలో మీటర్లకు ఒక అండర్ పాసింగ్ ఏర్పాటు చేయాలనే నిబంధనను ఉల్లంఘించి రోడ్డు నిర్మాణం చేయటంతో, తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ఇంటి నుంచి బయటకి వెళ్లిన వారు తిరిగి వచ్చేవరకూ కుటుంబ సభ్యుల్లో ఆందోళన నెలకొంటోంది. ప్రయాణికులు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వాహనాలు నడపాల్సిన పరిస్థితి. నాలుగు లేన్ల రోడ్డు విస్తరణతో ప్రమాదాలు తగ్గుతాయని ఆశించినా, ఇందుకు భిన్నంగా ప్రమాదాలు పెరిగి ప్రాణాలు గాల్లో కలసిపోవటంతో, ప్రజలు భయపడుతున్నారు. అయితే ప్రభుత్వం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 17 బ్లాక్ స్పాట్ల దిద్దుబాటు చర్యలకు పూనుకోవడంతో ప్రమాదాలు తగ్గి, ఇక సాఫీగా సాగుతుందని ఉమ్మడి జిల్లా ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

- రక్తమోడుతున్న 65వ జాతీయ రహదారి
- చౌటుప్పల్ నుంచి ఏపీ రాష్ట్రం నవాబుపేట వరకు 167 కిలోమీటర్ల పరిధిలో 17 బ్లాక్ స్పాట్లు
- హైవేపై ప్రయాణమంటేనే వణుకుతున్న వాహనదారులు
- రాంగ్ రూట్, అజాగ్రత్త.. అతివేగం.. మద్యం మత్తుతోనే ప్రమాదాలు
- బ్లాక్‌స్పాట్ల దిద్దుబాటు చర్యల్లో రాష్ట్ర ప్రభుత్వం
- ఇప్పటికైనా ప్రమాదాల తీవ్రత తగ్గేనా?
- ఆరు లేన్లుగా మార్చాలంటున్న ఉమ్మడి జిల్లా ప్రజలు

•7లో..

అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ గెలుపు

- రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయం
- నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్



హుజూర్‌నగర్‌లో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో అభ్యర్థి తీన్మార్ మల్లన్న

హుజూర్‌నగర్, కోదాడ, మే 19: రాష్ట్రంలో అత్యధిక పార్లమెంట్ స్థానాలను కాంగ్రెస్ గెలుస్తుందని, రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయమని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. హుజూర్‌నగర్, కోదాడలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న పరిచయ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశం కోసం రాహుల్‌గాంధీ కుటుంబం ఎన్నో త్యాగాలు చేసిందన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీ రెండు ఒక్కటేనన్నారు. మతోన్మాద బీజేపీతో ప్రజలకు అన్యాయం జరిగిందన్నారు. పదేళ్ల మోదీ పాలనలో దేశ ప్రతిష్ఠ దిగజారిందన్నారు. బీజేపీకి ఓటువేస్తే దేశాన్ని విచ్ఛిన్నం చేస్తుందన్నారు. రాజ్యాంగాన్ని ప్రధాని మోదీ ప్రభుత్వం అవమానిస్తోందన్నారు. ప్రతిపక్షాలపై కేసులు పెట్టి జైళ్లకు పంపుతున్నారని, ప్రశ్నించే గొంతులను అణచివేస్తున్నారన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకునే ప్రయత్నంలో కాంగ్రెస్‌కు ప్రజలు మద్దతు ఇవ్వాలన్నారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో పార్టీ ఎంపీ అభ్యర్థికి అత్యధిక మెజార్టీ రానుందన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కార్యకర్తలు విజయానికి సైనికుల్లా పనిచేశారని, ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో పార్టీ విజయానికి కృషిచేయాలన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ, బీఆర్‌ఎస్‌ను గత పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపిస్తే పల్లా రాజేశ్వర్‌రెడ్డి రాజీనామా చేసి, ఎమ్మెల్యేగా ఎందుకు పోటీ చేయాల్సి వచ్చిందో చెప్పాలన్నారు. ఆరేళ్లపాటు ప్రజా సమస్యలపై గళం విప్పాల్సిన టీఆర్‌ఎస్, ఉప ఎన్నికకు ఎందుకు వెళ్లాల్సి వచ్చిందో చెప్పాలని నిలదీశారు. పూర్తి కాలం పనిచేయకుండా రాజీనామాలకు వెళ్తూ ప్రజాధనాన్ని వృథా చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థిని ఓడించాలని పిలుపునిచ్చారు. 400 సీట్లు ఇస్తే దేశాన్ని అభివృద్ధి పథంలో నడుపుతామని చెబుతున్న బీజేపీ మాట వెనక కుట్ర దాగి ఉందన్నారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాలో 34 అసెంబ్లీ స్థానా ల్లో 32 స్థానాలు కాంగ్రెస్ గెలిచిందని, అది కార్యకర్తల కృషి ఫలితమే అన్నారు. అదేవిధంగా ఎమ్మెల్సీ ఎన్నికలో కార్యకర్తలు, నాయకులు పనిచేసి తన విజయానికి కృషిచేయాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు పద్మావతిరెడ్డి, మందుల సామేల్, నాయకులు వేనేపల్లి చందర్‌రా వు, చెవిటి వెంకన్న, శంకర్‌నాయక్, జగదీశ్వరరావు, యరగాని నాగన్నగౌడ్, గూడెపు శ్రీనివా సు, దొంగరి వెంకటేశ్వర్లు, సాముల శివారెడ్డి, చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, సామినేని ప్రమీల, వంగవీటి రామారావు, పారా సీతయ్య, మల్లెల రాణి, కొండూరు వెంకటేశ్వరరావు, యాతాకుల జ్యోతి, ఆశారెడ్డి, మందలపు కృష్ణకుమారి, నల్లపాటి శ్రీనివాస్, కొణతం ఉమ, సిలివేరు వెంకటేశ్వర్లు, నాగేంద్రబాబు, శ్రీనివాస్‌రెడ్డి, కీత వెంకటేశ్వర్లు, ఈదుప్పు గంటి సుబ్బారా వు, కొట్టే సైదేశ్వరరావు, గొట్టె వెంకట్రామయ్య, అరుణ్‌కుమార్, మంజూనాయక్, గెల్లి రవి, అజీజ్‌పాషా, కారింగుల వెంకటేశ్వర్లు, పార్వతి, సుబ్బరాజు, కంకణాల పుల్లయ్య, దొంగరి సత్యనారాయణ, మేకల నాగేశ్వరరావు, మహేష్‌గౌడ్, పాల్గొన్నారు.



ఊపందుకున్న.. ఎమ్మెల్సీ ప్రచారం

ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రచారం ఊపందుకుంది. ప్రచారానికి ఇంకా ఆరు రోజులే గడువు ఉండడంతో అభ్యర్థుల తరపున కీలకనేతలు రంగంలోకి దిగారు. మొత్తం 52మంది అభ్యర్థులు బరిలో ఉండగా, కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న, బీజేపీ నుంచి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నుంచి ఏనుగుల రాకేష్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. అభ్యర్థులతో పాటు వారి తరపున కీలకనేతలు ఈ ఆరు రోజులపాటు ఉమ్మడి జిల్లాలో ప్రచారం ఉధృతం చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే అసెంబ్లీ నియోజకవర్గస్థాయిల్లో పట్టభద్రుల సమావేశాలు నిర్వహించారు. మార్నింగ్ వాక్‌లు, సోషల్‌మీడియా, టీవీఛానళ్లతో పాటు, వాట్సప్‌గ్రూపుల ద్వారా ప్రచారాన్ని ఉధృతం చేశారు. మరోవైపున తెరవెనక తమ బలం, బలగాన్ని ఉపయోగించి పట్టభద్రుల ఓట్లు సాధించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఉద్యోగ నోటిఫికేషన్లు, బదిలీలు, పదోన్నతుల వంటి అంశాలతో పాటు, ప్రధానంగా బలమైన గొంతుకగా శాసనమండలిలో వాణి వినిపిస్తామనే ప్రచారాన్ని అభ్యర్థులు కొనసాగిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ,):

- అభ్యర్థుల గెలుపు కోసం రంగంలోకి కీలక నేతలు
- కాంగ్రెస్ అభ్యర్థి తరపున మంత్రులు, ఎమ్మెల్యేలు
- బీఆర్‌ఎస్ అభ్యర్థి కోసం కేటీఆర్ ప్రచారం
- బీజేపీ గెలుపు కోసం రంగంలోకి దిగిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
- పోటాపోటీ ప్రచారంతో వేడెక్కిన సమరం

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి 2021 ఎన్నికలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి గట్టిపోటీ ఇచ్చిన తీన్మార్ మల్లన్న ఈ దఫా కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. దీంతో ఆయన్ను గెలిపించేందుకు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డివెంకటరెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, కీలకనేతలు ప్రచారం సాగిస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గస్థాయి పట్టభద్రుల సదస్సులను నిర్వహించారు. ప్రశ్నించే గొంతుకగా రాజకీయాల్లోకి వచ్చిన తీన్మార్ మల్లన్నను తమకు తోడుగా శాసనమండలికి పంపాలని వారు కోరుతున్నారు. మేధావివర్గం, విద్యావంతులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు మల్లన్నను గెలిపించాలని కోరుతున్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలను పరిశీలించిన మంత్రులు, ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలోకి వెళ్లి ప్రతి ఒక్కరినీ కలిసి ఓటు రాబట్టేలా కార్యాచరణ అమలు చేస్తున్నారు. ఈ స్థానంలో పార్టీ అభ్యర్థి మల్లన్నను గెలిపించడం ద్వారా అధిష్ఠానం వద్ద తమ ప్రాబల్యం చాటేందుకు సిద్ధమయ్యారు. మంత్రులు, ఎమ్మెల్యేలు స్వయంగా రంగంలోకి దిగి, కిందిస్థాయిలో క్యాడర్‌ను అప్రమత్తం చేస్తూ పార్టీ అభ్యర్థి మల్లన్నను మొదటి ప్రాధాన్యం ఓటుతోనే గెలిపించేందుకు కార్యాచరణ అమలు చేస్తున్నారు. దీంతో తమ గెలుపు సులభమని పార్టీ ముఖ్యనేతలు చెబుతున్నారు.

సీటును నిలబెట్టుకోవాలనే తపనలో బీఆర్‌ఎస్

పట్టభద్రుల నియోజకవర్గం ఏర్పాటైనప్పటినుంచి వరుసగా గెలుస్తూ వచ్చిన బీఆర్‌ఎస్ ఈ ఎన్నికలోనూ సీటును నిలబెట్టుకునేందుకు ప్రయత్నిస్తోంది. పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి గెలుపు కోసం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రంగంలోకి దిగారు. ఈ స్థానం పరిధిలోని మూడు ఉమ్మడి జిల్లాలకు చెందిన పార్టీ నేతలందరికీ ఇప్పటికే రాకేశ్ విజయం కోసం పనిచేయాలని సూచించిన కేటీఆర్, సమయం దగ్గరకు వస్తుండడంతో ప్రచారం పర్వంలోకి స్వయంగా దిగారు. ఆదివారం భువనగిరిలో జరిగిన సభలో పాల్గొన్న ఆయన ఈ ఆరురోజుల పాటు ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఎమ్మెల్యేలు గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఇప్పటికే ప్రచారం ప్రారంభించారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఈ స్థానం నుంచి రెండు పర్యాయాలు పోటీచేయడంతో ఆయనకున్న విస్తృత సంబంధాలు, అనుభవం ఇక్కడ అభ్యర్థికి దోహదపడతాయని భావిస్తున్నారు. ఈ సీటును దక్కించుకోవడం ద్వారా ప్రశ్నించే ప్రతిపక్షంగా తాము పనిచేస్తామని బీఆర్‌ఎస్ నేతలు చెబుతున్నారు.

రంగంలోకి బీజేపీ అగ్రనేతలు

పట్టభద్రుల ఎమ్మెల్సీ సీటును గెలవాలనే లక్ష్యంతో బీజేపీ అగ్రనేతలు ప్రచార పర్వంలోకి దిగారు. కేంద్ర మంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నేతృత్వంలో అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి గెలుపునకు ప్రత్యేక వ్యూహం అమలు చేస్తున్నారు. రాష్ట్రంలో బీజేపీ బలపడిందని, పార్లమెంటు ఎన్నికల్లో తమదే పైచేయిగా చెబుతున్న కిషన్‌రెడ్డి, పట్టభద్రుల స్థానంలో తమ అభ్యర్థి ప్రేమేందర్‌ను గెలిపించాలని కోరుతున్నారు. విద్యావంతులు, మేధావులు, ఉపాధ్యాయ, ఉద్యోగులు బీజేపీతో కలిసి రావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. గ్రాడ్యుయేట్స్‌ను తమవైపు తిప్పుకునేందుకు కిషన్‌రెడ్డి ప్రత్యేకంగా కార్యాచరణ అమల్లోకి తెచ్చినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఆయన స్వయంగా ఇప్పటికే ఒక పర్యాయం వరంగల్, యాదాద్రి జిల్లాల్లో పట్టభద్రుల సమావేశాల్లో పాల్గొన్నారు. ఆదివారం మాజీ మంత్రి ఈటల రాజేందర్ నల్లగొండ జిల్లాలో పర్యటించారు. గతంలో ఎమ్మెల్సీగా పనిచేసిన అనుభవమున్న పార్టీ సీనియర్‌నేత ఎన్.రాంచందర్‌రావు సైతం ఈ స్థానంలో అభ్యర్థి గెలుపునకు సలహాలు, సూచనలు ఇస్తూ, నాయకులను అప్రమత్తం చేస్తున్నారు. ఈ ఆరురోజుల పాటు విస్తృత స్థాయిలో సోషల్‌మీడియా ద్వారా, మరోవైపున టీవీ ఛానళ్లలో, ప్రత్యేకంగా గ్రాడ్యుయేట్ల సదస్సులు నిర్వహించడం ద్వారా బీజేపీకి అనుకూల వాతావరణం సృష్టించాలని, ప్రత్యర్థులకంటే మెరుగ్గా పోరాడి మొదటి ప్రాధాన్యత ఓట్లు సాధించాలనే పట్టుదలతో బీజేపీ నాయకులు ప్రచారం సాగిస్తున్నారు.

పదేళ్ల మోదీ.. ఐదు నెలల్లో రేవంత్‌రెడ్డి
దేశాన్ని, రాష్ట్రాన్ని వెనుకబాట పట్టించారు

- శాసన మండలికి విద్యావేత్తను పంపాలా? బ్లాక్ మెయిలర్‌ను పంపాలో పట్టభద్రులు ఆలోచించాలి
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



ఆలేరులో సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డి

భువనగిరి టౌన్, ఆలేరు రూరల్, మే 19: ప్రధాని నరేంద్రమోదీ దేశాన్ని పదేళ్ల పాలనలో భ్రష్టు పట్టించగా, సీఎం రేవంత్‌రెడ్డి ఐదు నెలల్లో రాష్ట్రాన్ని వెనుకబాట పట్టించారని బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. ఆదివారం భువనగిరి, ఆలేరులో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ రెండు పార్టీల అవినీతిని ప్రశ్నించే వారిపై కేసులు పెట్టి జైలు పాలు చేస్తున్నాయని విమర్శించారు. బీజేపీ ఏకంగా ఓ సీఎంనే జైల్లో పెట్టగా, ఇక్కడి కాంగ్రెస్ సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్న పలువురిని అక్రమంగా కటకటాల వెనక్కి నెడుతోందని ఆరోపించారు. అయినా బీఆర్‌ఎస్ తన ప్రశ్నించే తత్వాన్ని విడనాడదన్నారు. పదేళ్ల పాలనలో సాధించిన విజయాలను ప్రజలకు చెప్పుకోలేకపోవడం, చిన్నచిన్న కారణాలతో కొన్ని వర్గాలకు దూరం చేసుకున్నందునే అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప తేడాతో అధికారాన్ని కోల్పోయామన్నారు. బిట్స్‌పిలానీలో ఉన్నత చదువులు చదివిన రైతు బిడ్డ ఏనుగుల రాకేష్‌రెడ్డిని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నిలుపగా, కాంగ్రెస్ మాత్రం ఓ బ్లాక్ మెయిలర్‌ను శాసన మండలికి పంపేందుకు చేస్తున్న ప్రయత్నాలను పట్టభద్రులు గమనించాలన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే నిరుద్యోగ యువత ప్రయోజనాల కోసం పోరాడతానని, ఎమ్మెల్సీ గౌరవ భృతితో పాటు అన్ని ప్రయోజనాలను విద్యార్థుల సంక్షేమ నిధికి అందజేస్తానని పేర్కొన్నారు.

నల్లగొండలో రాకేష్‌రెడ్డి ప్రచారం

నల్లగొండ: బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డి ఆదివారం జిల్లా కేంద్రంలో జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఎన్జీ కళాశాలలో వాకర్స్‌ను, గ్రంథాలయంలో విద్యార్థులను, నిరుద్యోగులను ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, కటికం సత్తయ్యగౌడ్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రెగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, బోనగిరి దేవేందర్, కొండూరు సత్యనారాయణ, మదుసూదన్‌రెడ్డి, రావుల శ్రీనివాస్ రెడ్డి, బొమ్మరబోయిన నాగార్జున, అంబటి ప్రణీత్, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ రహిత దేశంగా చేయడమే లక్ష్యం

ఐఈసీ డిప్యూటీ డైరెక్టర్ రవికుమార్



హెచ్‌ఐవీ మృతులకు నివాళులర్పిస్తున్న ఐఈసీ డిప్యూటీ డైరెక్టర్ రవికుమార్, తదితరులు

నల్లగొండ రూరల్, మే 19: దేశాన్ని 2030 నాటికి హెచ్‌ఐవీ రహితంగా చేయడమే లక్ష్యమని రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఐఈసీ విభాగం డిప్యూటీ డైరెక్టర్ రవి కుమార్ అన్నారు. అంతర్జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కాండిల్ లైట్ స్మారక దినోత్సవం సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు, ఆస్పత్రి వైద్యులు, హెచ్‌ఐవీ బాధితులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రస్తుతం 745 మంది హెచ్‌ఐవీ బాధితులు చికిత్సను మధ్యలో నిలిపివేశారని, వారికి స్వచ్ఛంద సంస్థల ద్వారా కౌన్సిలింగ్ ఇప్పించి క్రమం తప్పకుండా మందులు వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో ఇండెక్స్ టెస్టింగ్ కార్యక్రమం ద్వారా హెచ్‌ఐవీ సోకిన వారి భాగస్వాములకు సైతం పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. హెచ్‌ఐవీ రహిత దేశంగా మార్చేందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సిబ్బంది సుధాకర్, శివ ప్రసాద్, జోసెఫ్, స్వచ్ఛంద సంస్థ సిబ్బంది, ట్రాన్స్ జెండర్ ప్రతినిధులు, నేస్తం సొసైటీ నిర్వాహకుడు వెంకన్న, ఏఆర్‌టీ వైద్య అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్టలో భక్తుల రద్దీ



ఆదివారం వారాంతపు సెలవు కావడంతో రద్దీగా మారిన యాదగిరిగుట్ట ఆలయం

కేసీఆర్ హామీలనే రేవంత్‌రెడ్డి ఇచ్చారు

- ఉప ఎన్నికలో మేధావులు ఆలోచించి ఓటు వేయాలి
- మాజీ మంత్రి ఈటల



నల్లగొండలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

నల్లగొండటౌన్, మిర్యాలగూడ, మే 19: మాజీ సీఎం కేసీఆర్ ఇచ్చిన మోసపూరిత హామీలనే రేవంత్‌రెడ్డి ఇచ్చారని, అతి తక్కువ కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలతో ఛీ కొట్టించుకుందని మాజీ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయం, మిర్యాలగూడలో నిర్వహించిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా ఎవరూ ఊహించని విధంగా సర్వేలకు కూడా అర్థం కాని ఫలితాలు రానున్నాయన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలంతా దేశ పురోగమనం, దేశ ఔన్నత్యం కోసం మోదీ నాయకత్వం కావాలని కోరుకుంటున్నారని అన్నారు. గత ఎన్నికల్లో కేసీఆర్ ఇచ్చిన హామీలే నేడు రేవంత్‌రెడ్డి ఇచ్చాడని, వాటి అమలు బీఆర్‌ఎస్‌కు సాధ్యం కాలేదని, రెండు లక్షల రుణమాఫీ ఎలా జరుగుతుందని సందేహం వ్యక్తం చేశారు. శాసనమండలి ఉప ఎన్నికలో ప్రజలంతా ఆలోచించి బీజేపీ అభ్యర్థి ప్రేమందర్‌రెడ్డికి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశాల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ జనార్దన్, నాయకులు శానంపూడి సైదిరెడ్డి, సంకినేని వెంకటేశ్వర్లు, గోలి మధుసూధన్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, సుభాష్‌చందర్, మాదగోని శ్రీనివాస్‌గౌడ్, సాధినేని శ్రీనివాస్, లాలునాయక్, కంకణాల నివేదిత, బొబ్బ భాగ్యరెడ్డి, సుభాష్‌రెడ్డి, కన్మంత శ్రీదేవిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు నారపరాజు రాంచందర్‌రావు, కాటేపల్లి జనార్దన్, గార్లపాటి వెంకటయ్య, సాధినేని శ్రీనివాసరావు, సుభాష్‌చందర్‌జీ, గూడూరు శ్రీనివాసరావు, చెరుపల్లి కరుణాకర్, సుధాకర్, సత్యప్రసాద్, పురుషోత్తంరెడ్డి, సైదులు, సరిత, పాల్గొన్నారు.

జూన్ 8 వరకు 'ప్రజావాణి' రద్దు

నల్లగొండ టౌన్, మే 19: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ముగిసినప్పటికీ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఉన్న నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుందని, జూన్ 8 వరకు ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేశామని కలెక్టర్ దాసరి హరిచందన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు, అలాగే వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల శాసనమండలి ఉప ఎన్నిక పోలింగ్, కౌంటింగ్, తదితర కారణాలరీత్యా కేంద్ర ఎన్నికల సంఘం జూన్ 8 వరకు జిల్లాలో ఎన్నికల కోడ్‌ను విధించిందన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం నిర్వహించే ప్రజావాణిని రద్దు చేశామన్నారు. దీన్ని జిల్లా ప్రజలు గమనించాలని కోరారు.

రెండు కోడె దూడలకు జన్మనిచ్చిన ఆవు

మోతె, మే 19: సూర్యాపేట జిల్లా మోతె మండలంలోని సిరి కొండ ఆవాసం కాశిగూడెం గ్రామానికి చెందిన రైతు షేక్ బాబుకు చెందిన చెందిన ఆవు ఐదో ఈతలో ఆదివారం ఒకే సారి రెండు కోడె దూడలకు జన్మనిచ్చింది. దీంతో రెండు దూడలను చూసేందుకు గ్రామస్థులు తరలివచ్చారు. జన్యుమార్పిడి, పౌష్టికాహారాన్ని పూర్తిస్థాయిలో అందిస్తే ఇలాంటి ఘటనలు అక్కడక్కడా చోటు చేసుకుంటాయని పశువైద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.



రెండు కోడె దూడలకు జన్మనిచ్చిన ఆవు

రేపటి నుంచి నృసింహుని కల్యాణ మహోత్సవాలు

కోదాడ రూరల్, మే 19: సూర్యాపేట జిల్లా కోదాడ మండలం యర్రవరంలోని బాలఉగ్రనరసింహస్వామి దివ్య కల్యాణ మహోత్సవాలను ఈ నెల 21వ తేదీ నుంచి 23 వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ నలజాల జగన్నాథం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 21వ తేదీ ఉదయం 10 గంటల నుంచి గణపతి పూజ, ఆరాధన, పుణ్యాహవాచనం, దీపారాధన, మూలమూర్తులకు కలశస్థాపన, శీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామివారి కల్యాణం. రాహు, కేతు పూజలు, నవగ్రహ పూజలు, కుజగ్రహ దోష నివారణ పూజలు నిర్వహిస్తారని తెలిపారు. 22వ తేదీ బుధవారం నరసింహస్వామి జయంతి సందర్భంగా ఉదయం ఏడు గంటల నుంచి అష్టకలశ స్థాపన, పంచామృత, పంచసుగంధ ద్రవ్యాలతో స్వామివారి అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. 11 గంటలకు చెంచులక్ష్మి, రాజ్యలక్ష్మి సమేత నరసింహస్వామి కల్యాణం నిర్వహిస్తామన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నదానం చేస్తామన్నారు. సాయంత్రం ఐదు గంటలకు కుంకుమార్చనలు, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. . 23వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు అగ్నిజ్ఞానం, సుదర్శన హోమాలు, పూర్ణాహుతి నిర్వహిస్తామన్నారు. ఈ కల్యాణ మహోత్సవాలకు రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి హాజరవుతున్నట్లు తెలిపారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.



ఓటు హక్కును వినియోగించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కేశవులు, చిత్రంలో దుశ్చర్ల సత్యనారాయణ

● సమాచార హక్కు పరిరక్షణ సమితి జాతీయ చైర్మన్ బొమ్మరబోయిన కేశవులు

నల్లగొండటౌన్, మే 19: వారం రోజుల్లో జరగనున్న వరంగల్- ఖమ్మం - నల్లగొండ శాసనమండలి ఉపఎన్నికలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సమాచార హక్కు పరిరక్షణ సమితి ఎలక్షన్‌వాచ్ కమిటీ జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన పట్టభద్రుల సమావేశంలో ఓటు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొన్నటి వరకు జరిగిన ఎన్నికల్లో ఈవీఎంలో ఓటు వేయగా ఈ సారి బ్యాలెట్ పద్ధతిలో వేయాల్సి ఉంటుందని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ప్రాధాన్యత క్రమంలో ఎంతమందికైనా ఓటు వేయవచ్చని, కాకపోతే ఒకటి, రెండు, మూడు ప్రాధాన్య క్రమంలో నెంబర్లు వేయాల్సి ఉంటుందని వివరించారు. ఒకవేళ ఒక్క అభ్యర్థికే వేయాలనుకుంటే ఒకటి నెంబర్ వేస్తే సరిపోతుందని, అలా కాకుండా ప్రాధాన్య క్రమంలో ముగ్గురు, నలుగురికి వేయాలనుకున్నప్పుడు తమకు నచ్చిన అభ్యర్థులకు మొదట ఒకటి, తర్వాత 2, ఆ తర్వాత 3 ఇలా ప్రాధాన్య బట్టి ఓటు వేయవచ్చన్నారు. పట్టభద్రులు మేధావులు అయినందుకు చదువుకున్న వారందరూ విజ్ఞతతో తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జలసాధన సమితి జాతీయ అధ్యక్షుడు దుశ్చర్ల సత్యనారాయణ, సంస్థ సలహాదారుడు కోట్ల రామలింగం, కమిటీ సభ్యులు అనూష, మహేష్, వెంకన్న, జిల్లా గ్రంథాలయ సంస్థ సిబ్బంది నాగయ్య, శ్రీను, పట్టభద్రులు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం : కేసు నమోదు

నిడమనూరు, మే 19: నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం రాజన్నగూడెం గ్రామంలో యువతి అదృశ్యమైంది. ఎస్ఐ గోపాల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన షేక్ జానిమియా, అనిఫా దంపతుల కూతురు కరిష్మా(23) ఇంటర్ వరకు చదివి టైలరింగ్ చేసుకుంటూ ఇంటి వద్దే ఉంటోంది. శనివారం గ్రామంలో తన స్నేహితురాలి పుట్టినరోజు ఫంక్షన్‌కు వెళ్లి వస్తానని తల్లితో చెప్పి వెళ్లింది. కానీ మరుసటి రోజు వరకు కూడా ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల వారు, బంధువుల ఇళ్లలో విచారించినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో తన కూతురు కనిపించడం లేదని కరిష్మా తల్లి అనిఫా ఆదివారం నిడమనూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



నుజ్జునుజ్జయిన వాహనం, గాయపడిన యువకులు

చిట్యాల, మే19: నల్లగొండ జిల్లా చిట్యాల శివారులో జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్తున్న ట్రాలీ వాహనం చిట్యాల శివారులోకి రాగానే ముందు వెళుతున్న లారీ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో పక్కకు తప్పించే యత్నంలో పక్కనే ఉన్న మరో ట్రాలీ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో వాహనం ముందు భాగం నుజ్జునుజ్జు కాగా అందులో ఉన్న వారిని బయటకు తీయడానికి కష్టపడ్డారు. ట్రాలీ వాహనం డ్రైవర్ ఎస్ఆర్ బాబుతో వాహనంలో ప్రయాణిస్తున్న బీహర్‌వాసులు మనీష్, రాహుల్‌కుమార్, చందన్‌కుమార్ గాయపడ్డారు. గాయపడిన వారిని నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రికి తరలించారు. గాయపడిన బీహర్‌వాసులు హైదరాబాద్ నుంచి విజయవాడ వెళుతున్నట్లు తెలిసింది.

హత్య చేసి.. దహనానికి యత్నం

కనగల్, మే 19: నల్లగొండ జిల్లా కనగల్‌లోని వాగు బ్రిడ్జి కింద మృతదేహం లభ్యమైంది. ఆదివారం సాయంత్రం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. శవం సమీపంలో ఓ బ్యాగు లభించగా అందులో దుస్తులు, ఆధార్ కార్డు లభించాయి. ఆధార్‌కార్డులో సముద్రాల కృష్ణ (50) న్యూగుండ్లపల్లి, యాదగిరిగుట్ట చిరునామా ఉంది. మృతదేహం కుళ్లినస్థితిలో ఉండగా రెండు మూడు రోజుల క్రితమే హత్య జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని కాల్చేందుకు దుండగులు యత్నించినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. ఆధార్‌కార్డుపై ఉన్న చిరునామా ప్రకారం వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టు చండూరు సీఐ వెంకటయ్య, ఎస్ఐ రామకృష్ణగౌడ్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తామని తెలిపారు. మృతుడు యాదగిరిగుట్టకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారిగా తెలుస్తుంది.

ఎర్రసానిగూడెం స్టేజీ వద్ద వ్యక్తి హత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కట్టంగూరు, మే 19: నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలంలోని ఎర్రసానిగూడెం స్టేజీ వద్ద ఆదివారం సాయంత్రం వ్యక్తి హత్యకు గురయ్యాడు. ఎస్ఐ ఎన్.శ్రీను తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా జిల్లా పామర్ మండలం, చెట్లవారిపురం గ్రామానికి చెందిన కొల్లూరి రాజవర్ధన్ (35) ఈ నెల 18వ తేదీన ఏపీ39 టీయూ 6541 నెంబర్ గల టాటా ఏసీ గూడ్స్ వాహనంలో ఇంటి సామగ్రి తీసుకుని విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లాడు. శనివారం రాత్రి హైదరాబాద్‌లో అన్‌లోడ్ చేసి అదే రాత్రి విజయవాడకు బయలుదేరాడు. నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం ఎర్రసానిగూడెం స్టేజీ వద్ద గుర్తుతెలియని వ్యక్తులు కాళ్లు కట్టి వేసి దాడిచేసి చంపి జాతీయ రహదారి పక్కన ఉన్న డబ్బా వెనుక భాగంలో పడవేసినట్లు ఎస్ఐ తెలిపారు. సంఘటనా స్థలాన్ని నల్లగొండ డీఎస్పీ కె.శివరాంరెడ్డి పరిశీలించారు. హత్యకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీను తెలిపారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్నికల నేపథ్యంలో జరిగిన హత్యనా, డబ్బుల కోసం ఎవరైనా ఎక్కడో హత్య చేసి ఇక్కడ పడవేశారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతుడి కుడిచేతి మణికట్టుపై తీవ్ర గాయాలు ఉన్నాయని, ఎవరో కొట్టి చంపినట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయని ఎస్ఐ తెలిపారు. రాజవర్ధన్ భార్య సోనాలీని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించామని పూర్తి వివరాలు తెలుసుకుంటామన్నారు. రాజవర్ధన్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కల్లుగీత కార్మికుడికి గాయాలు

చిట్యాలరూరల్, మే 19: ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి పడి కల్లుగీత కార్మికునికి గాయాలయ్యాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఏపూర్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బూరుగు సత్యనారాయణ కల్లు గీస్తూ ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి కిందపడ్డాడు. దీంతో ఆయనకు గాయాలవడంతో కుటుంబసభ్యులు సత్యనారాయణను నార్కట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రిలో చేర్పించారు. బాధితుడిని గౌడ సంఘం మండల అధ్యక్షుడు కూనూరు సంజయ్‌దాస్‌గౌడ్ పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట బీజేపీ నాయకులు గోవర్ధన్, పల్లె వెంకన్న, చికిలంమెట్ల అశోక్, పురం ప్రశాంత్ ఉన్నారు.

● ప్రమాదాలు

స్పాట్ పెడుతున్నాయ్

● బ్లాక్‌స్పాట్‌ల వద్ద ప్రమాదాలు, పెద్ద సంఖ్యలో మృతులు, వేలల్లో క్షతగాత్రులు ● డిజైన్ లోపం.. సర్వీస్ రోడ్ల లేమితో, బ్లాక్‌స్పాట్ల ప్రమాదాలు
● రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ప్రముఖులు ● నల్లబండగూడెంనుంచి దండుమల్కాపురం వరకు జిల్లాలో 145 కి.మీ.ల పరిధిలో విస్తరణ
● బ్లాక్‌స్పాట్‌ల వద్ద ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు సిద్ధం ● 65వ నెంబర్ హైవేపై తెలంగాణలో 16, ఏపీలోని నవాబుపేట వద్ద బ్లాక్‌స్పాట్‌ల గుర్తింపు


కోదాడ మండలం శ్రీరంగాపురం వద్ద లారీ ఢీకొన్న కారు(ఫైల్)

కోదాడ, మే 19: ప్రమాదాలకు కేంద్ర బిందువు అయిన ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 65వ నెంబరు జాతీయ రహదారిపై దిద్దుబాటు చర్యలు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. నిత్యం పదుల సంఖ్యలో ప్రమాదాలకు, వందల సంఖ్యలో మృతులు, అధిక సంఖ్యలో క్షతగాత్రులకు నిలయంగా మారిన ఈ రహదారిని సరిదిద్దేందుకు చర్యలు తీసుకుంటోంది. దీనికోసం ఈ నెల 17వ తేదీన రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జీఎంఆర్ ప్రతినిధులతోపాటు, ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. 65వ నెంబర్ జాతీయరహదారిపై 17 బ్లాక్‌స్పాట్‌లే ప్రమదాలకు కారణమని నిర్ధారించారు. ప్రమాదాలకు చెక్‌పెట్టాలని, అందుకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని సూచించారు. దీంతో బ్లాక్‌స్పాట్‌ల వద్ద అవసరమైన ఫ్లైఓవర్లు, అండర్‌పాసు, సైన్‌బోర్డుల ఏర్పాటుతోపాటు, ప్రమాదాల నివారణ చర్యలకు ఉపక్రమిస్తున్నారు. గతంలో బ్లాక్‌స్పాట్‌లను గుర్తించినప్పటికీ చర్యలు తీసుకోకపోవటంపై వాహనదారులు అసహనం వ్యక్తంచేస్తున్నారు. జీఎంఆర్ నిర్లక్ష్యం ఫలితంగా ప్రమాదాల్లో ప్రముఖులతోపాటు, అధిక సంఖ్యలో ప్రాణాలు గాలిలో కలిసిపోవటంపై వాహనదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఎట్టకేలకు ప్రభుత్వం బ్లాక్‌స్పాట్‌ల వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు వార్తలు రావటంతో వాహనదారుల్లో హర్షం వ్యక్తమవుతోంది. 65వ నెంబర్ రహదారిపై ప్రమాదాల నివారణకు తలపెట్టిన సమావేశం తూతూ మంత్రంగా కాకుండా, అమలుకు నోచేలా ఉండాలని వాహనదారులు డిమాండ్‌చేస్తున్నారు.

తెలంగాణలో పదహారు, ఏపీలో ఒకటి

తెలంగాణలోని చౌటుప్పల్, పెదకాపర్తి, చిట్యాల, కట్టంగూర్, ఇనుపాముల, టేకుమట్ల, సూర్యాపేట సమీపంలోని ఎస్వీ కళాశాల, ఈనాడు జంక్షన్, దురాజ్‌పల్లి, ముకుందాపురం, ఆకుపాముల, కొమరబండ, కట్టకొమ్ముగూడెం, మేళ్లచెర్వు ఎక్స్‌రోడ్డు, శ్రీరంగపురం, రామాపురం, ఏపీలోని నవాబుపేట వద్ద మొత్తంగా 17 బ్లాక్‌స్పాట్‌లను గుర్తించారు.

2012లో జాతీయ రహదారి విస్తరణ

జాతీయ రహదారి అంటేనే వాహనాలు, ప్రయాణికుల రాకపోకలకు అనువుగా ఉండాల్సిన దారి. అందులో భాగంగా ప్రభుత్వం 60 శాతం జన సాధారణ వాహనాలకోసం, 40శాతం సరుకుల రవాణాకోసం రహదారులను నిర్మిస్తుంది. కాగా ప్రభుత్వం హైదారాబాద్ నుంచి విజయవాడ వరకు 65వ నెంబర్ జాతీయ రహదారిని 2012లో విస్తరణ చేసింది. కాగా తెలంగాణ సరిహద్దు నల్లబండ గూడెంనుంచి హైదరాబాద్ సమీపంలోని దండుమల్కాపురం వరకు జిల్లాలో ఎన్‌హెచ్ 65 సుమారు 145 కి.మీ.ల మేరకు ఉంది.

డిజైన్ లోపం.. సర్వీసు రోడ్ల లేమి

జాతీయ రహదారి ఉపరితల డిజైన్ సరిగా లేకపోవటం, మూలమలుపులు, అండర్‌పాస్‌లు, హెచ్చరిక బోర్డుల లేమి, రాత్రివేళల్లో ప్రమాద హెచ్చరికలు సూచించే లైట్లు లేకపోవటం, వాహనాదారులు 130 కి.మీ.ల అతి వేగం, జంక్షన్ల వద్ద నిబంధనలు పాటించకుండా జీఎంఆర్ సంస్థ ఇనుప కంచెలు ఏర్పాటు చేయకపోవటం, గేదెలు రోడ్డుపైకి రావటంతో ప్రమాదాలు


మునగాల మండలం ఆకులపాముల రహదారిపై ప్రమాదకరంగా గేదెల సంచారం

పెరిగిపోతున్నాయి. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల ఉదాసీనత ఫలితంగా నెలలో పదులసంఖ్యలో ప్రమాదాలు, వందల సంఖ్యలో నిండు ప్రాణాలను గాలిలో కలిసిపోవటం 65వ నెంబర్ జాతీయరహదారిపై నిత్యకృత్యమయ్యింది. అంతేగాక జీఎంఆర్ సంస్థ ఏపీలోని నవాబ్‌పేట వద్ద రోడ్డు క్రాస్‌తో వాహనదారులు, పాదచారులు వాహనాల స్పీడ్‌ను అంచనా వేయలేకపోవటం, రెప్పపాటులో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

ప్రమాదంలో ప్రముఖులు మృతి

2013 ఆగస్టు 15న ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లాల్ జాన్‌పాష నార్కట్‌పల్లి వై జంక్షన్ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో, అదేవిధంగా 2014 డిసెంబరు 7వ తేదీన నందమూరి హరికృష్ణ తనయుడు జానకీరాం మునగాల మండలం ఆకుపాముల మూలమలుపు వద్ద ట్రాక్టర్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. అదేవిధంగా 2014 మార్చి6న కృష్ణా జిల్లా కమ్యూనికేషన్ ఎస్పీ హరికృష్ణ గరుడ బస్సులో ప్రయాణిస్తున్న క్రమంలో తాడువాయి స్టేజీ సమీపంలో గేదెలు అడ్డురావటంతో బస్సు పల్టీ కొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు.

హైదరాబాద్‌కు ఒక్కరోజే 45వేల వాహనాలు

విజయవాడ నుంచి హైదరాబాద్‌కు ఈ నెల 13న ఒక్క రోజే 45 వేల వాహనాలు వెళ్లినట్లు సమాచారం. దీంతో జాతీయరహదారి ఎంత రద్దీగా ఉంటుందో అర్థమవుతుంది. ఈ నేపథ్యంలో బ్లాక్‌స్పాట్‌ల వద్ద ప్రమాదాల అడ్డుకట్ట వేయటంతోపాటు, 65వ నెంబరు జాతీయరహదారిని ఆరులేన్లుగా మార్చాలని వాహనదారులు, రహదారివెంటవాసులు డిమాండ్ చేస్తున్నారు.

అండర్‌పాస్‌లు లేకపోవడంతోనే..

1


చౌటుప్పల్‌లో బ్లాక్ స్పాట్

చౌటుప్పల్: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలకేంద్రంలో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని విస్తరించినప్పటికీ నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. రోడ్డు విస్తరణ జరగకముందు పరిస్థితి మామూలుగా ఉండేవి. రోడ్డు విస్తరణ జరిగిన తర్వాతే ప్రమాదాల సంఖ్య ఎక్కువవుతోంది. దీనికి ప్రధాన కారణం జాతీయ రహదారిపై రోజురోజుకు వాహనాల సంఖ్య పెరగడం, సిగ్నల్ వ్యవస్థ లేకపోవడం ప్రధాన కారణంగా కనిపిస్తోంది. దీనికితోడు రోడ్డు విస్తరణ సమయంలో అండర్‌పాస్ నిర్మాణం జరగకపోవడంతో రోడ్డు దాటే విషయంలో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ముందుకు వెళ్లి యూటర్న్ తీసుకుని వచ్చే బదులు రాంగ్ రూట్లో తొందరగా వెళ్లొచ్చన్న భావనతో వాహనదారులు ఇష్టం వచ్చినట్లు రాకపోకలు సాగిస్తున్నారు. అదేవిధంగా రాత్రి సమయాల్లో ట్రాఫిక్ సిబ్బంది కూడా ఉండకపోవడంతో రోడ్డు క్రాస్ చేసే వద్ద వాహనదారులు రాంగ్ రూట్‌లో వెళ్లడం, ప్రమాదాలకు కారణమవుతోంది. ప్రమాదాల నివారణకు చౌటుప్పల్ మండల కేంద్రంలో వెహికల్ అండర్ పాస్ నిర్మించాలని కొంతకాలంగా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల అండర్ పాస్ నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయి. టెండర్లు కూడా ఇటీవల పూర్తయ్యాయి. త్వరలో పనులు ప్రారంభించే అవకాశం కనిపిస్తుంది. చౌటుప్పల్ మండలంలో 2023లో మొత్తం 105 ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాల్లో 30 మంది మరణించగా, 65 మంది గాయపడ్డారు. 2024 సంవత్సరంలో మొత్తం ప్రమాదాలు 35 జరిగాయి. ఇందులో 12 మంది మృతిచెందగా, 30 మంది గాయపడ్డారు.

అజాగ్రత్తతోనే ప్రమాదాలు

2



చిట్యాలరూరల్: నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి నుంచి వట్టిమర్తి వరకు సుమారు 20 కిలోమీటర్ల వరకు జాతీయ రహదారి ఉంది. జాతీయ రహదారిపై పలు ప్రాంతాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో పోలీసుశాఖ ఆ ప్రాంతాన్ని బ్లాక్‌స్పాట్‌గా గుర్తించింది. మండలంలో నాలుగు బ్లాక్‌స్పాట్‌లున్నాయి. గుండ్రాంపల్లి శివారులో డబుల్‌బెడ్‌రూం ఇండ్ల వద్ద ఉన్న క్రాసింగ్, వెలిమినేడు శివారులో పిట్టంపల్లి క్రాస్‌రోడ్డు వద్ద, పెద్దకాపర్తి శివారులో చెరువు సమీపంలో ఉన్న క్రాసింగ్ వద్ద, వట్టిమర్తి గ్రామ స్టేజీ వద్ద ఉన్న క్రాసింగ్‌ను పోలీసుశాఖ బ్లాక్‌స్పాట్‌లుగా గుర్తించబడింది. రహదారిపై ప్రమాదాలు జరిగే సమయంలో పోలీసు ఉన్నతాధికారులు ప్రమాదం జరిగిన తీరును తెలుసుకుంటారు. జాతీయ రహదారి విస్తరణ జరిగాక రహదారిపై ఉన్న గ్రామాలకు వెళ్లేందుకు గ్రామాల వద్ద, దగ్గరలో, శివారులో రోడ్డును వాహనాలు దాటేందుకు రహదారి నిర్మాణ సమయంలో క్రాసింగ్‌లు ఏర్పాటుచేసింది. ఇక్కడి నుంచి వాహనదారులు అజాగ్రత్తగా వెళుతుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. గుండ్రాంపల్లి శివారులోని క్రాసింగ్ వద్ద ప్రమాదం జరిగితే చికిత్స కోసం సుమారు 12 కి.మీ.ల దూరంలో ఉన్న చౌటుప్పల్‌కు గాని, 23 కి.మీ.ల దూరంలో గల నార్కట్‌పల్లి శివారులోని కామినేని ఆస్పత్రికి తరలిస్తుంటారు. 2022లో జాతీయ రహదారిపై సుమారు 69 ప్రమాదాలు జరిగ్గా, 26 మంది మృతిచెందగా 33 మంది గాయపడ్డారు. 2023 లో 67 ప్రమాదాలు జరగ్గా, 33 మంది మృతిచెందగా 24 మంది గాయపడ్డారు. ఈ ఏడాదిలో ఏప్రిల్ వరకు సుమారు 22 ప్రమాదాలు జరగ్గా, 16 మంది మృతిచెందగా, 10మంది గాయపడ్డారు.

సర్వీస్ రోడ్డు విస్తరణేదీ..?

3



చిట్యాల: విజయవాడ-హైదరాబాద్ 65వ నెంబర్ జాతీయ రహదారిపై నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణంలోని భువనగిరి రోడ్ జంక్షన్ వద్ద తరుచూ ప్రమాదాలు జరిగి ప్రజలు మృత్యువాత పడుతున్నారు. హైవే విస్తరణతో చిట్యాల పట్టణం ఉత్తర, దక్షిణ భాగాలుగా విడిపోయింది. ఇటు నుంచి అటు వెళ్లాలన్నా, అటు నుంచి ఇటు రావాలన్నా అక్కడ నుంచే వెళ్లాల్సి ఉంటుంది. అలాగే నల్లగొండ, సూర్యాపేట నుంచి వచ్చే వాహనాలు భువనగిరికి వెళ్లాలంటే అక్కడి నుంచే క్రాస్ కావాలి. దీంతో అక్కడ ట్రాఫిక్ ఎక్కువ కావడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతాన్నాయి. హైవే విస్తరణ సమయంలోనే బ్రిడ్జి నిర్మిస్తామని జీఎంఆర్, నేషనల్ హైవే అథారిటీ అధికారులు చెప్పినప్పటికీ ఆ సమయంలో కొంతమంది స్థానికులు వ్యతిరేకించారు. తరుచూ ప్రమాదాలు జరుగుతుండడతో ఈ జంక్షన్‌ను బ్లాక్ స్పాట్‌గా గుర్తించారు. గత రేండేళ్లలో 28 ప్రమాదాలు జరిగి, 12మంది మృత్యువాత పడగా సుమారు 45 మంది గాయపడ్డారు. జాతీయ రహదారిపై చిట్యాల పట్టణ పరిధిలో బ్రిడ్జిని, లేదంటే బైపాస్ రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ప్రదేశంలో గాయపడిన వారిని సాధారణంగా నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలిస్తున్నారు. ఇదే కాకుండా చిట్యాల రైల్వేస్టేషన్ రోడ్ వద్ద కూడా తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అక్కడ జరిగే ప్రమాదాలు అరికట్టడానికి అక్కడి వరకు సర్వీసు రోడ్డును విస్తరించాలని ప్రజలు కోరుతున్నారు.

రక్షణ చర్యలు తీసుకోరూ..

5

కేతేపల్లి: కేతేపల్లి మండలంలోని ఇనుపాముల గ్రామ శివారులోని రెండు ప్రమాదకర జంక్షన్లలో రక్షణ చర్యలు తీసుకునే వారు లేకుండా పోయారు. గ్రామ బస్టాప్ వద్ద నిర్మించిన అండర్ పాసింగ్ వంతెనకు ఇరువైపులా కొంత దూరంలో ఈ జంక్షన్లున్నాయి. మల్లన్నగుట్ట వద్ద గల జంక్షన్‌లో ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఇదే జంక్షన్ నుంచి ఇనుపాముల గ్రామస్థులు వ్యవసాయ భూములకు వెళుతుంటారు. మరోవైపు సూర్యాపేట వైపు నుంచి నల్లగొండ, హైదరాబాద్ వైపునకు వెళ్లే ఆర్టీసీ బస్సులు నకిరేకల్ పట్టణంలోకి వెళ్లడానికి ఆర్టీసీ బస్సుల డ్రైవర్లు ఈ జంక్షన్‌లోనే మలుపు తీసుకుంటారు. దీంతో ఈ రహదారిపై వెళ్లే వాహనాలతోపాటు రోడ్డు దాటే పశువులు, ఎడ్ల బండ్లతో ఈ జంక్షన్ గజిబిజిగా ఉంటుంది. ఈ జంక్షన్ సమీపంలోనే విజయవాడ వైపు వెళ్లే లేన్‌లో పెట్రోల్‌బంక్ ఉండడంతో హైదరాబాద్ లేన్‌లో వెళ్లే ద్విచక్ర వాహనదారులు, ట్రాక్టర్లు, ఆటోవాలాలు ఈజంక్షన్‌లో యూటర్న్ తీసుకుని డీజిల్, పెట్రోల్‌కోసం బంకుకు వెళ్లిన వారు పని ముగిశాక ఫర్లాంగు దూరం రాంగ్‌రూట్‌లో ప్రయాణించి హైదరాబాద్ లేన్‌లోకి వెళుతుంటారు. ఈ క్రమంలో ప్రమాదాలు చోటుచేసుకుని ప్రాణాలు కోల్పోవడమేగాక అనేక మంది క్షతగాత్రులుగా మారుతున్నారు. ఇనుపాముల నుంచి నకిరేకల్ పట్టణంలోకి వెళ్లే వైపు ఉన్న జంక్షన్ మరింత ప్రమాదకరంగా మారింది. నకిరేకల్ నుంచి విజయవాడ, సూర్యాపేట వైపునకు వెళ్లే వాహనాలు ఇక్కడే హైవే మీదకు చేరతాయి. ఇనుపాముల నుంచి సర్వీసు రోడ్డు మీదుగా ప్రయాణిస్తూ నకిరేకల్ పట్టణంలోకి వెళ్లే వాహనాలు నకిరేకల్ నుంచి హైవే మీదకు వెళ్లే వాహనాలు ఈ జంక్షన్‌లో ఎదురెదురుగా ప్రయాణిస్తుంటాయి. ఇక్కడ జరిగిన ప్రమాదాల్లో పలువురు ద్విచక్రవాహనదారులు మృత్యువాతపడ్డారు. ఇక్కడ డివైడర్లు ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఈ దిశగా చర్యలు తీసుకునే వారులేకుండా పోయారు. క్షతగాత్రులను 108, జీఎమ్మార్ అంబులెన్సుల్లో మూడు కిలోమీటర్ల దూరంలో గల నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తారు. ఇక్కడ ఆర్టీసీ బస్సులు మలుపు తీసుకోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


ప్రమాదకరంగా ఆంధ్రప్రదేశ్ పరిధిలోని నవాబుపేట జంక్షన్

12,13,14,15,17

ఫ్లైఓవర్లు లేకపోవడంతోనే..

కోదాడటౌన్: కోదాడ సమీపంలో జాతీయ రహదారిపై మూడు బ్లాక్ స్పాట్‌లు ఉన్నాయి. కట్టకొమ్ముగూడెం, మేళ్ళచెర్వు ఎక్స్‌రోడ్డు, శ్రీరంగాపురం ఉన్నాయి. ఆయా బ్లాక్‌స్పాట్‌ల వద్ద 2023 నుంచి ఈ నెల 19వ తేదీ వరకు 10 ప్రమాదాలు జరగ్గా, ఇద్దరికి గాయాలు కాగా, 11 మంది మృత్యువాత పడ్డారు. కోదాడ పట్టణ సమీపంలోని 65వ నెంబరు జాతీయరహదారిపై శ్రీరంగాపురం, కట్టకొమ్ముగూడెం జంక్షన్ వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారి విస్తరణలో భాగంగా ఆయా జంక్షన్ల వద్ద సాంకేతికంగా ఫ్లైఓవర్లు నిర్మించాల్సి ఉంది. ఆ దిశగా చర్యలు తీసుకోకపోవటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

కట్టకొమ్ముగూడెం రోడ్డులో నిత్యం ప్రమాదాలు

కట్టకొమ్ముగూడెం రోడ్డులోని పలు గ్రామాలవాసులు నిత్యం వేల సంఖ్యలో కోదాడకు వివిధ పనుల నిమిత్తం వస్తూ ఉంటారు. వారంతా 65వ నెంబరు రహదారిని దాటి రావాలి. రహదారిపై వేలసంఖ్యలో వాహనాలు వస్తుండటంతో, వాటి వేగాన్ని అంచనా వేయలేని వాహనదారులు ప్రమాదాల బారినపడడం నిత్యకృత్యంగా మారింది. ప్రమాదాలపై కట్టకొమ్ముగూడెం రోడ్డులోని గ్రామాలకు చెందిన ప్రజలు ధర్నాలు చేపట్టిన ప్రయోజనం లేకుండా పోయింది.

అండర్‌పాస్ నిర్మించాలి

శ్రీరంగాపురం వద్ద గత నెల ఏప్రిల్ 25వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతి చెందటం, రహదారిపై జరుగుతున్న ప్రమాదాలకు అద్దంపడుతోంది. జాతీయరహదారిని దాటుతూ శ్రీరంగాపురం గ్రామస్థులు నిత్యం పొలం పనులకు వెళ్లాల్సి ఉంటుంది. గ్రామస్థులు వెళ్లేదగ్గర జాతీయ రహదారిపై అండర్‌పాస్ నిర్మించాల్సి ఉంది. 2023లో కట్టకొమ్ముగూడెం, మేళ్ళచెర్వు ఎక్స్‌రోడ్డు, శ్రీరంగాపురం జంక్షన్ల వద్ద నాలుగు ప్రమాదాలు జరగ్గా ఒకరికి గాయాలు కాగా, ముగ్గురు మృతి చెందారు. 2024 జనవరి నుంచి ఏప్రిల్ వరకు ఆరు ప్రమాదాలు జరగ్గా, ఒకరికి గాయాలు కాగా, ఎనిమిది మంది మృతిచెందారు.

ఏపీలో నవాబుపేటతోపాటు మరికొన్ని జంక్షన్లలో..

ఏపీలో నవాబుపేటతోపాటు బలుసుపాటు, గౌరవరం, కొంగర మల్లయ్యగట్టు, కొనకంచి అడ్డరోడ్డులో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు పేర్కొంటున్నారు.

సంవత్సరమైనా ప్రారంభం కాని పనులు

16

కోదాడ రూరల్: మండలంలోని నల్లబండగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతమైన రామాపురం క్రాస్ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. జాతీయ రహదారి నాలుగు లేన్ల విస్తరణ అనంతరం ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో ఉన్న రామాపురం క్రాస్‌రోడ్డు నాలుగు కూడళ్ల రహదారిగా ఉండడం వల్ల ప్రమాదాలు జరుగుతుండడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణ సమయంలో అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం చేయాలని అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదన్నారు. రామాపురం క్రాస్‌రోడ్డు నాలుగు కూడళ్ళ రహదారిగా ఉండడం వల్ల కనీసం రింగ్ రోడ్డయినా ఏర్పాటు చేయాలని కోరినా పట్టించుకోలేదు. క్రాస్‌రోడ్డు దగ్గరలోనే పలు సిమెంట్ పరిశ్రమలకు చెందిన పలు ట్రాన్స్‌పోర్టు లారీలు పెద్దఎత్తున ఏర్పాటు చేశారు. దీనివల్ల వందల కొద్దీ లారీలు జాతీయ రహదారి నుంచి రామాపురంకు రాకపోకలు సాగిస్తున్నాయి. ఆంధ్రా సరిహద్దు ప్రాంతం కావడం వల్ల నాలుగు రోడ్ల జంక్షన్‌గా ఉన్న రామాపురం క్రాస్‌రోడ్డులో నిత్యం గ్రామీణ ప్రాంతాల నుండి ప్రజలు పెద్దఎత్తున రాకపోకలు సాగిస్తుంటారు. జాతీయ రహదారి నుండి రామాపురం వరకు సుమారు 12 గ్రామాల ప్రజలు ఈ రహదారి గుండానే రాకపోకలు సాగిస్తున్నారు. కోదాడకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్ళాలంటే వారు మధ్యలో ఉన్న జాతీయ రహదారిని దాటి వెళ్ళాల్సి ఉంటుంది. అండర్‌పాస్ బ్రిడ్జీల నిర్మాణం కోసం రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద రూ. 3.17 కోట్ల నిధులు మంజూరు చేసింది. నిధులు మంజూరై సంవత్సరమైనా ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదు.

టేకుమట్ల వద్ద

టెన్షన్.. టెన్షన్

6


రోడ్డు ప్రమాదాలకు నిలయంగా ఉన్న జనగాం క్రాస్‌రోడ్డు జంక్షన్

సూర్యాపేట రూరల్: సూర్యాపేట మండలంలోని టేకుమట్ల, రాయినిగూడెం, పిల్లలమర్రి, జనగాం క్రాస్‌రోడ్డు ప్రమాదాలకు కేంద్ర బిందువుగా మారింది. ఈ ప్రాంతాల్లో ఎక్కువ ప్రమాదాలు జరుగుతుండంతో ఈ ప్రాంతాలను బ్లాక్‌స్పాట్లుగా పోలీసులు గుర్తించారు. ఈ బ్లాక్‌స్పాట్‌ల వద్ద పోలీసులు బారికేడ్లను ఏర్పాటుచేసి ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నారు. అదేవిధంగా జనగాం క్రాస్ రోడ్డు నుంచి టేకుమట్ల వరకు సైన్ బోర్డులను ఏర్పాటుచేశారు. ఈ పరిధిలో రెండు స్పీడ్‌గన్‌లతో ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసి 80స్పీడ్ దాటిన వాహనాల నెంబర్‌ను ట్రేస్‌చేసి వారికి ఆన్‌లైన్‌లో చలానా విధిస్తున్నారు. అంతేకాకుండా జనగాం క్రాస్‌రోడ్డులో ప్రతీ రోజు వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు.

మూడేళ్లలో 57 మంది మృతి

జాతీయ రహదారి 65పై జనగాం క్రాస్ రోడ్డు నుంచి టేకుమట్ల వరకు పోలీసులు గుర్తించిన బ్లాక్‌స్పాట్‌ల వద్ద మూడేళ్లలో రోడ్డు ప్రమాదాలతో 57మంది మృతి చెందగా, 82 మంది క్షతగాత్రులయ్యారు. జాతీయ రహదారి నాలుగు లేన్ల నిర్మాణం చేసేటప్పుడే జనగాం క్రాస్ రోడ్డు, రాయినిగూడెం, టేకుమట్ల వద్ద ఫ్లైఓవర్లను నిర్మిస్తే ఈ ప్రమాదాలు జరగకుండా ఉండేవని స్థానికులు అంటున్నారు. నిత్యం రద్దీగా ఉండే జాతీయ రహదారిపైకి వెళ్లాలంటే స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టేకుమట్ల, జనగాం క్రాస్‌రోడ్డులలో ఫ్లైఓవర్ల నిర్మాణానికి సంవత్సరం క్రితమే రూ.170కోట్లు మంజురయ్యాయి. కానీ వాటి పనులు మాత్రం మొదలు కాలేదు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?

7

సూర్యాపేటటౌన్: జిల్లాకేంద్రంలో బ్లాక్‌స్పాట్‌లలో ప్రమాదాలు ఏమాత్రం తగ్గడంలేదు. ముఖ్యంగా బ్లాక్‌స్పాట్‌లలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా పదుల సంఖ్యలో ప్రాణాలు పోతున్నా చర్యలు మాత్రం శూన్యంగా మారాయి. జిల్లాకేంద్రంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంతం, జనగాం క్రాస్‌రోడ్డు, అంజనాపురి కాలనీ ప్రాంతం, నూతన వ్యవసాయ మార్కెట్ ప్రాంతం, తిరుమలనగర్(ఈనాడు) ప్రాంతంలో బ్లాక్‌స్పాట్‌లను గుర్తించారు. బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించడానికి కారణం ఈ ప్రాంతాల్లో దాదాపు నాలుగు రోడ్లు కలుస్తుండడం చౌరస్తాగా మారడంతో వాహనాల రాకపోకల సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఉదాహరణకు జనగాం క్రాస్‌రోడ్డు ప్రాంతంలో పట్టణంనుంచి వచ్చే రోడ్డు, జనగాం వైపు వెళ్లే రోడ్డు, హైదరాబాద్, విజయవాడరోడ్డు మొత్తంగా నాలుగు రోడ్లు ఒకచోట కలిసి చౌరస్తాగా మారుతుంది. ఇక్కడ ప్రమాదాలు జరుగుతుండడంతో బ్లాక్‌స్పాట్‌లుగా గుర్తించారు. ముఖ్యంగా జనగాం క్రాస్‌రోడ్డు ప్రాంతంలో పెట్రోల్ బంకులు ఉండడం, అక్కడే రోడ్డుపై నిత్యం లారీలు ఆపుతున్నారు. ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల అంజనాపురి కాలనీ ప్రాంతంలో ఆగి ఉన్న లారీని వెనుకనుంచి ఆటో ఢీకొట్టగా ప్రమాదంలో ఏడుగురు మృతి చెందారు. అదేవిధంగా తిరుమలనగర్(ఈనాడు కార్యాలయం) ప్రాంతంలో జాతీయ రహదారిని కలుపుకొని జమ్మిగడ్డ నుంచి రోడ్డు ఉండడంతో జాతీయ రహదారి వైపు వచ్చే సమయంలో అతివేగంగా జాతీయ రహదారి నుంచి వెళ్లే వాహనాలకు అడ్డుగా వస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అంతేకాకుండా పక్కనే వైన్స్ షాప్ ఉండడంతో మందుబాబులు రోడ్డుపైకి వచ్చే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. సర్వీస్ రోడ్డు లేకపోవడం కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయి. అంతేకాకుండా అన్ని బ్లాక్‌స్పాట్‌ల ప్రాంతాల్లో వాహనదారులు రాంగ్‌రూట్‌లో వెళుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. అదేవిధంగా జిల్లాకేంద్రంలో గుర్తించిన బ్లాక్‌స్పాట్‌లు అన్ని కూడా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి ఒకటి లేదా రెండు కిలోమీటర్ల దూరంలోనే ఉండడం గమనార్హం. అయినప్పటికీ ప్రమాదాలు జరిగితే 100శాతం కాపాడే పరిస్థితి తక్కువగా ఉంది. ఈ బ్లాక్ స్పాట్‌ల ప్రదేశాల్లో వాహనాలు మాత్రమే కాదు ప్రజలు నడచి వెళ్లాలంటేనే భయపడుతున్నారు.

రెండేళ్లలో 200 ఘటనలు

8

సూర్యాపేటక్రైం: సూర్యాపేట పట్టణంలోని జనగాం క్రాస్ రోడ్డు, అంజనాపురి క్రాస్‌రోడ్డు, వ్యవసాయ మార్కెట్ క్రాస్‌రోడ్డు, రాజీవ్ పార్కు వద్ద ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రమాదాల నివారణకు అధికారులు ఈ నాలుగు ప్రాంతాల్లో వాహనాల వేగాన్ని తగ్గించేందుకు రోడ్డుపై స్టాపర్లను ఏర్పాటుచేశారు. రెండేళ్లలో నాలుగు ప్రాంతాల్లో కలిపి 200కు పైగా ప్రమాదాలు జరుగగా, అందులో పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారు. ఇటీవల అంజనాపురి క్రాస్ రోడ్డు వద్ద లారీని ఆటోఢీకొన్న ప్రమాదంలో ఏడుగురు మృతి చెందారు. ప్రమాదం జరిగే ప్రదేశం నుంచి చికిత్స నిమిత్తం తరలించేందుకు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి రెండు కి.మీ.ల దూరంలోనే ఉంది. ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే అండర్‌పాసింగ్ ఏర్పాటు చేయాలి.

దురాజ్‌పల్లిలో అతివేగం.. అజాగ్రత్తతో..

9

చివ్వెంల: సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం దురాజ్‌పల్లి జంక్షన్ ప్రమాదాలకు నిలయంగా మారింది. దురాజ్‌పల్లి జంక్షన్ నుంచి మిర్యాలగూడ రోడ్డుకు, పెన్‌పహాడ్ వెళ్లే రోడ్లకు వాహనాల రాకపోకలు రద్దీగా ఉంటాయి. రెండేళ్ల కాలంలో ప్రమాదాలకు గురై 10మంది మృతి చెందగా, 50 మందికి పైగా గాయపడ్డారు. దురాజ్‌పల్లి బ్లాక్‌స్పాట్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణంతోపాటు ఇరువైపుల వెళ్లేందుకు సర్వీస్ రోడ్డు నిర్మిస్తే ప్రమాదాలు జరగకుండా ఉంటాయి. స్థానిక పోలీసులు స్టాపర్లను ఏర్పాటు చేసినా, వాహనదారులు అతివేగంగా వచ్చి వాటిని ఢీకొట్టిన సంఘటనలు అధికం. దీనికితోడు దురాజ్‌పల్లి పెద్దగట్టు సమీపంలో ఉన్నందున గట్టుకు వెళ్లే భక్తులు ప్రతీవారం వేల సంఖ్యలో రెండు నెలలకోసారి లక్షల సంఖ్యలో హాజరవుతుండడంతో ఫ్లైఓవర్ నిర్మాణం లేక విజయవాడ, హైదరాబాద్ జాతీయ రహదారి-65పై జాతర సమయంలో రెండు నుంచి మూడు రోజులపాటు రాకపోకలు నిలిపివేస్తున్నారు. ఆ సమయంలో ఈ వాహనాలను మిర్యాలగూడ, ఖమ్మం రోడ్డు మీదుగా వాహనాలను మళ్లిస్తున్నారు. దురాజ్‌పల్లి జంక్షన్ నుంచి కాశీంపేట స్టేజీ జంక్షన్ వరకు ఫ్లైఓవర్ నిర్మాణంతోపాటు సర్వీస్ రోడ్డును నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదాలకు జంక్షన్

4



కట్టంగూరు: కట్టంగూరులోని నల్లగొండకు వెళ్లే క్రాస్‌రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. 65వ నెంబర్ జాతీయ రహదారిపై కట్టంగూరు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా ఉన్న జంక్షన్ వద్ద నిత్యం అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లే వాహనాలు, విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలతోపాటు నల్లగొండ జిల్లా కేంద్రం నుంచి వచ్చే వాహనాలతో ఈ జంక్షన్ మూడు కూడళ్ల జంక్షన్‌గా మారి ప్రమాదాల జంక్షన్‌గా మారింది. రెండేళ్ల నుంచి ఈ జంక్షన్ వద్ద ఏడు ప్రమాదాలు సంభవించగా అందులో ముగ్గురు వ్యక్తులు దుర్మరణం చెందడంతోపాటు ఆరుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. వీరితోపాటు పదుల సంఖ్యలో స్వల్ప గాయాలయ్యాయి.

ప్రమదాల జంక్షన్ నుంచి 10కి.మీల దూరంలో ఆస్పత్రులు

కట్టంగూరులోని నల్లగొండ క్రాస్‌రోడ్డు వద్ద జరిగే ప్రమాదాల్లో క్షతగాత్రులయిన వారిని వైద్యం కోసం తీసుకెళ్లేందుకు చాలా దూరం ప్రయాణించాల్సి వస్తోంది. కట్టంగూరుకు 10కి.మీల దూరంలో ఉన్న కామినేని ఆస్పత్రి, 15 కి.మీల దూరంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రి, 12కి.మీల నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రులు ఉండటంతో వైద్యంకోసం వెళ్లే క్షతగాత్రులు మృత్యువాతపడుతున్నారు.

కట్టంగూరు వద్ద ఫ్లైఓవర్ నిర్మించాలి



కట్టంగూరులోని పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న నల్లగొండ జంక్షన్ వద్ద నిత్యం అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ జంక్షన్ వద్ద ఫ్లైవోవర్ నిర్మించినట్లయితే ప్రమాదాలు నివారించవచ్చు.

రెడ్డిపల్లి వీరస్వామి, కట్టంగూరు

అవగాహన కల్పించాలి

10,11



మునగాల: సూర్యాపేట జిల్లా మునగాల మండలకేంద్రంలో 2023-24 మే 15వ తేదీ వరకు 65కి పైగా ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాల్లో 62 మంది మృతి చెందగా, 125 మందికి గాయాలయ్యాయి. హైవేపై మండలంలో 18 కి.మీ.ల పొడవునా తరచూ ప్రమాదాలు జరుగుతున్న ఐదు ప్రాంతాలను బ్లాక్‌స్పాట్లు గుర్తించారు. మండలంలో ఆకుపాముల, ముకుందాపురం, తాడ్వాయి, మొద్దులచెరువు, మాధవరం స్టేజీ, ప్రాంతాలను బ్లాక్ స్పాట్ (డెంజర్‌గా) పోలీస్ ఉన్నత అధికారులు గుర్తించి, ఆయా ప్రాంతాల్లో వాహనాలు నెమ్మదిగా వెళ్లేందుకు స్టాప్ బోర్డులు ఏర్పాటు చేశారు. అయినా ప్రమాదాల సంఖ్య తగ్గటం లేదు. ఇదిలా ఉంటే ప్రతీ గ్రామంలో వాహదారులకు రోడ్డుపై జరిగే ప్రమాదాల కారణాలను అధికార యంత్రం వివరించి చైతన్యం చేయాలి. పోలీస్, ఆర్టీవో వారు ప్రతీ సంవత్సరం నిర్వహించే రోడ్డు భద్రతా వారోత్సవాలు సదస్సులను మొక్కుబడిగా కాకుండా అందరికీ అర్థమయ్యేలా చెప్పాలి. ఆటోలు, ట్రాక్టర్ నడిపే వారు, యూటర్న్, ఎడమ నుంచి కుడి వైపునకు వెళ్లేటప్పుడు తొందరపాటు జాగ్రత్త వహించటంతో ప్రమాదాల నివారణకు మైలురాయిగా భావించవచ్చని స్థానికులు పేర్కొంటున్నారు.

మునగాల సర్వీస్ రోడ్డు నిర్మాణం అసంపూర్తితో...

మునగాల పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న రహదారి పక్కన సర్వీస్‌రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా నిలిచి పోవటంతో నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారింది. ముస్లిం ఖబరస్తాన్ స్థలం పరిష్కారం కాకపోవటంతో 150 మీటర్ల పొడవు సర్వీస్ రోడ్డు నిర్మాణం నిలిచిపోయింది. 2009లో రోడ్డు విస్తరణ జరిగినప్పుడు ముస్లిం ఖబరస్తాన్ స్థలం సుమారు 25 మీటర్లు పొడవు, 10 మీటర్ల వెడల్పుతో స్థలం రోడ్డు నిర్మాణానికి అడ్డంకిగా ఉండటంతో, ఆస్థలం అధికారులు జీఎంఆర్ సంస్థకు అప్పగిస్తే రోడ్డు నిర్మాణం చేపడతామన్నారు. దీనిపై ఉన్నతాధికారులు, వక్ఫ్ బోర్డు అధికారులు పలుమార్లు పరిశీలించారు. కానీ పరిష్కారం చేయలేదు. అంతేగాక నిత్యం వందలాది మంది తహసీల్దార్ కార్యాలయం, నారాయణగూడెం గ్రామానికి వెళ్లే వారు సర్వీస్ రోడ్డు లేక వాహనాలు ఎదురుగా రావటంతో హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లే వాహనాలకు ఢీకొని పలు ప్రమాదాలు జరిగి ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు.

సర్వీస్ రోడ్డును నిర్మించాలి

మిగిలి ఉన్న సర్వీస్‌రోడ్డు నిర్మిస్తే ప్రమాదాలు తగ్గుతాయి. ఇక్కడ జరిగిన ప్రమాదాల్లో అనేక మంది మృత్యువాతపడ్డారు. మరికొందరికి కాళ్లు, చేతులు విరిగి ఇబ్బందులు పడుతున్నారు.

జైపాల్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మునగాల

బంగారు మైసమ్మ ఆలయ అభివృద్ధికి కృషి

● పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి


మైసమ్మతల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

దామరచర్ల, మే 19: బంగారు మైసమ్మతల్లి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని బాపూజీ నగర్‌లో బంగారు మైసమ్మతల్లి జాతరను ఆదివారం భక్తులు వైభవంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తమ మొక్కులను చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్‌తో కలిసి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు స్కైలాబ్‌నాయక్, నాగునాయక్, బెజ్జం సాయి, సిద్ధునాయక్ తదితరులు పాల్గొన్నారు.

జాతర ప్రశాంతంగా నిర్వహించుకోవాలి


జాతర పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

చిట్యాల, మే 19: చిట్యాల బాలనర్సింహస్వామి జాతరను ప్రశాంత, ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే వేముల వీరేశం కోరారు. ఈ నెల 23వ తేదీన జరిగే జాతర ప్రచార పోస్టర్లను ఆదివారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీరేశం మాట్లాడుతూ జాతరలు మన సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు కాకులారపు బొర్రారెడ్డి, సభ్యు మారగోని అంజనేయులు, పోకల దేవదాస్, జడల చినమల్లయ్య, ఏర్పుల పరమేశం, కుక్కల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ స్ఫూర్తి వ్యాప్తి చెందాలి


విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

చిట్యాల రూరల్, మే 19: గ్రంథాలయాల స్ఫూర్తి మరింత వ్యాప్తి చెందాలని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి ఆకాంక్షించారు. చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సాయుధ పోరాటానికి వారసత్వం వహించిన గడ్డపై గ్రామ యువత ఆధ్వర్యంలో 19 సంవత్సరాలుగా గ్రంథాలయం నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం శిబిరంలో నిర్వహించిన చిత్రలేఖనం, చెస్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గాదె వినోద్‌రెడ్డి, దుబ్బ కుమార్, గ్రంథాలయ అధ్యక్షుడు అనుముల శ్రీనివాస్, వెల్లంకి లక్ష్మణాచారి, గరిశె అంజయ్య, పంతంగి శ్రీకాంత్, గ్రంథపాలకుడు గోపగోని శ్రీనివాస్, ఆనంద్, అంజయ్య, రవి, గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రక్షణ కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదం


ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మృతి చెందిన మేక

నార్కట్‌పల్లి, మే 19: రక్షణ కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్‌తో పశువులు, గొర్లు, మేకలు ప్రమాదాల బారిన పడుతున్నాయి. రోడ్డు పక్కనే నేలను తాకే లా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రమాదవశాత్తు ఆనుకుని మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. దీంతో బాధిత రైతులు, పశుపోషకులు నష్టపోతున్నారు. ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని బాధితులు, గ్రామస్థులు విద్యుత్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని శాపల్లిలో కమలాద్రి లక్ష్మీనరసింహస్వా మి ఆలయానికి వెళ్లే దారిలో రోడ్డు పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. అది నేలను తాకేలా ఉండటంతో మేతమేస్తూ వెళ్లిన మూగజీవాలు ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకి పలు పర్యాయాలు ప్రమాదాలు జరిగాయి. ఆదివారం కూడా గ్రామానికి చెందిన కాసర్ల శ్రీనివాస్‌రెడ్డికి చెందిన రెండు మేకలు విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడ్డాయి. ఈ విషయాన్ని సంబంధిత విద్యుత్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా వారు ఈ సమస్యను తేలిగ్గా తీసుకుని నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని మాజీ వార్డు సభ్యుడు వెంకట్‌రెడ్డి ఆరోపించారు. మూగజీవాలే కాకుండా రాత్రి సమయంలో ఈ ట్రాన్స్‌ఫార్మర్ వలన ఎవరికీ నష్టం జరగకముందే విద్యుత్ సిబ్బంది ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

26 నుంచి 'మహిషాసురమర్దిని' జాతర

అడవిదేవులపల్లి, మే 19: భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతున్న మహిషాసురమర్దిని అమ్మవారి జాతర ఈ నెల 26 నుంచి జూన్ 3వ తేదీ వరకు జరగనుందని ఆలయ అర్చకుడు వెల్లటూరి రామ్మోహన్ తెలిపారు. ఆదివారం ఆయన జాతర వివరాలు వెల్లడించారు. 26న బియ్యం కోల, 30న సిరిమానోత్సవం, 31న కుంకుమ బండ్లు(ప్రభ బండ్లు), జూన్ 1న దుర్గమ్మ బలి, 2న ఈదమ్మ బలి, 3న దీవె బండారి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్ మాట్లాడుతూ అమ్మవారి జాతరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ఆయా జిల్లాల నుంచి అనేక మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారని తెలిపారు. అంగరంగ వైభవంగా జరిగే అమ్మవారి జాతరలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఉండేందుకుగాను ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట కార్యక్రమంలో బండి వెంకటేశ్వర్లు, నరసింహ, బండి నాగేశ్వర్‌రావు ఉన్నారు.

మార్గాలు మార్చుతూ కబేళాలకు

▸ రాత్రి సమయంలో రవాణా
▸ అడ్డుకుంటున్న యువకులు
▸ చర్యలు తీసుకోవాలని డిమాండ్


అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనం

కొండమల్లేపల్లి, మే 19: గుట్టుచప్పుడు కాకుండా రాత్రి సమయంలో కబేళాలకు గోవులను తరలిస్తున్నారు. పలుమార్లు అక్రమ రవాణాను అడ్డుకుంటుండటంతో అక్రమార్కులు పట్టుబడకుండా మార్గాలు మార్చుతూ రవాణా చేస్తున్నారు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ప్రతీ ఆదివారం పశువుల సంత పెద్దగా జరుగుతుంది. ఈ నేపథ్యంలో కొందరు గోవులను కొనుగోలు చేస్తున్నారు. గతంలో వాటిని నేరుగా కొండమల్లేపల్లి నుంచి హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో ఉన్న కబేళాలకు తరలించేవారు. గమనించిన స్థానిక యువకులు ఈ రవాణాను అడ్డుకుంటున్నారు. దీంతో దీంతో అక్రమార్కులు వారి పంథాను మార్చుకుంటున్నారు. సంత నిర్వహించే రోజు వాటిని కొనుగోలు చేసి డంప్ చేస్తున్నారు. వాటిని కొండమల్లేపల్లి నుంచి కాకుండా వేరే మార్గాల్లో కబేళాలకు తరలిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. కొనుగోల చేసిన గోవులను మండల పరిధిలోని చింతచెట్టుతండా, పెండ్లిపాకల, వర్ధమానిగూడెం, దేవరకొండ పరిసర ప్రాంతాల్లో దొడ్లుగా (డంపుగా) ఏర్పాటు చేసుకుంటున్నట్లు సమాచారం. ఆదివారం సంత జరిగే రోజు పశువులను కొనుగోలు చేసి అక్కడ ఊళ్లను పంపడానికి, పశువులకు కాపలాగా కొంతమంది రైతులను ఏర్పాటు చేసుకుంటున్నట్లు యువకులు ఆరోపిస్తున్నారు. వారానికి రెండు మూడు రోజులు గుట్టుచప్పుడు కాకుండా అర్ధరాత్రి 12 గంటల నుంచి రెండు గంటల సమయంలో డీసీఎం,టాటా ఏస్ వాహనాల్లో గుట్టుచప్పుడు కాకుండా రాత్రి సమయంలో హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్, కేరళ తదితర ప్రాంతాలలోని కబేళాలకు తరలిస్తున్నారు. పశువులను కబేళాలకు తరలిస్తున్న వారికి మండల స్థాయి ప్రజాప్రతినిధులతో పాటు అధికారుల అండదండలు ఉన్నట్లు సమాచారం. రాత్రి సమయంలో పోలీసులు నిఘా పెట్టకపోవడం, పెట్రోలింగ్ చేయకపోవడంతోనే ఈ అక్రమ రవాణాదారులు నెలకు వందల సంఖ్యలో పశువులను కబేళాలకు తరలిస్తున్నారు. ఇదే క్రమంలో శుక్రవారం అర్ధరాత్రి ఆంధ్రప్రదేశ్ నుంచి డీసీఎం వాహనంలో 50 ఆవులను కొండమల్లేపల్లి హైదరాబాద్‌కు మీదుగా తరలిస్తుండగా సమాచారం అందుకున్న దేవరకొండ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు రాత్రి వేళలో పెట్రోలింగ్ చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

నిఘా ఏర్పాటు చేశాం



గోవులను రాత్రి సమయంలో కబేళాలకు తరలిస్తున్న విషయం మా దృష్టికి వచ్చింది. రాత్రి సమయంలో నిఘా ఏర్పాటు చేసి ఎవరైనా గోవులను అక్రమంగా కబేళాకు తరలిస్తే చర్యలు తీసుకుంటాం.
- రామ్మూర్తి, ఎస్ఐ, కొండమల్లేపల్లి

పేదల పక్షాన పోరాడిన సుందరయ్య

● జిల్లాలో పుచ్చలపల్లికి ఘన నివాళి


సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి సుధాకర్‌రెడ్డి

నల్లగొండరూరల్, చిట్యాల, మిర్యాలగూడ, నార్కట్‌పల్లి, దేవరకొండ, హాలియా, చండూరు రూరల్, వేములపల్లి, చిట్యాల రూరల్, మే 19: తెలంగాణ సాయుధ పోరాటయోధుడు పుచ్చలపల్లి సుందరయ్య పేదల పక్షాన, ప్రజా సమస్యల సమస్యలపై, వారి హక్కుల సాధన కోసం, నిరంతరం కృషిచేసిన త్యాగధనుడని, ఆయన నేటి తరానికి ఆదర్శప్రాయుడని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటానికి పులమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి సుధాకర్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం తెలంగాణ ప్రాంతంలో జరిగిన సాయుధ రైతాంగ పోరాటంలో పుచ్చలపల్లి సుందరయ్య అగ్రభాగాన నిలిచి సాయుధ పోరాటాన్ని చేశారని గుర్తుచేశారు. ఆయన పార్లమెంటు, అసెంబ్లీలో ప్రజా సమస్యలపై పాలకులను నిలదీస్తూ ఆదర్శ నేతగా అందరి మన్ననలు పొందారని అన్నారు. నేడు ఎంతో మంది రాజకీయ నాయకులు తమ వ్యక్తిగత స్వార్థం కోసం, విలువలను మరిచి అక్రమ సంపాదన, పదవి వ్యామోహంతో పార్టీలు మారుతూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ఆరోపించారు. తన సొంత భూమిని పేదలకు పంచి రాజకీయాల్లో నూతన ఒరవడిని సృష్టించారని అన్నారు. పెట్టుబడి దారులకు, భూస్వాములకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడారని గుర్తు చేశారు. నేటి యువత సుందరయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఆయన ఆశయ సాధన కోసం కంకణబద్ధులై పనిచేయాలన్నారు.


మిర్యాలగూడలో సుందరయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

● నల్లగొండలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నాయకులు నారి ఐలయ్య, సయ్యద్ హాషం, పాలడుగు నాగార్జున, పి.ప్రభావతి, ఎండీ సలీం, పుచ్చకాయల నర్సిరెడ్డి, దండెంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ, సరోజ, అరుణకుమారి, భిక్షం తదితరులు పాల్గొన్నారు. నల్లగొండ మండలంలోని కొత్తపల్లి, కంచనపల్లి, అంనంతారం, కతాల్‌గూడలో పాటు పలు గ్రామాల్లో సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు.

● చిట్యాలలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి ఆధ్వర్యంలో సుందరయ్యకు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, మల్లం మహేష్, అరూరి శ్రీను, శీలా రాజయ్య, కత్తుల లింగస్వామి, ఐతరాజు నర్సింహ పాల్గొన్నారు.

● మిర్యాలగూడలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బీకార్ మల్లేష్ ఆధ్వర్యంలో ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. ఈదులగూడెం చౌరస్తాలో సుందరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, జగదీష్‌చంద్ర, రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, భవాండ్ల పాండు, రాగిరెడ్డి మంగారెడ్డి, పరుశరాములు, శశిధర్‌రెడ్డి, వరలక్ష్మి, తిరుపతి రాంమూర్తి, అంజద్, ఆయూబ్, సీతారాములు, వినోద్‌నాయక్, సత్యనారాయణ పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి చెరుకు పెద్దులు, నాయకులు చింతపల్లి బయ్యన్న, కొప్పు శ్రవణ్, జాల యాదమ్మ, అర్థం శ్రీనివాస్, ఆమనగంటి అయిలయ్య, నరేష్ పాల్గొన్నారు.

● దేవరకొండలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల కార్యదర్శి నల్ల వెంకటయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బిజిలి లింగయ్య, యాదగిరి, శ్రీను, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

● హాలియాలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సుందరయ్యకు నివాళులర్పించారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కూన్‌రెడ్డి నాగిరెడ్డి, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కత్తి శ్రీనివాస్‌రెడ్డి, ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి కారంపూడి ధనమ్మ, పెద్దవూర సీఐటీయూ నాయకుడు షేక్ బషీర్, సీపీఎం నాయకులు రెబెల్లి వెంకటేశం, సురేష్, ఉపాధ్యాయులు వెంకటయ్య, ఖాసీం, రమేష్, వర్షిత్ పాల్గొన్నారు.

● చండూరు మండలంలోని నెర్మట గ్రామంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల సహాయకార్యదర్శి జెర్రిపోతుల ధనుంజయగౌడ్, నాయకులు అంతిరెడ్డి, ఈరగట్ల స్వామి, ఈరటి వెంకన్న, సోనగోని గణేష్, కొత్తపల్లి వెంకన్న, యాదయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

● వేములపల్లిలో సుందరయ్య చిత్రపటానికి వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పాల్వాయి రాంరెడ్డి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోలెబోయిన వరలక్ష్మి, రొండి శ్రీనివాస్, కోడిరెక్క రాధా, సుకన్య, వెంకన్న, సైదులు పాల్గొన్నారు.

● చిట్యాల మండలంలోని చిన్నకాపర్తిలో సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు జిట్ట నగేష్, పానుగుళ్ల అచ్చాలు, అవిశెట్టి శంకరయ్య, అరూరి శ్రీను, రాములు, విష్ణుమూర్తి, మల్లయ్య, ఇద్దయ్య పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

● ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం


నల్లగొండలో నిర్వహించిన సమ్మేళనంలో పాల్గొన్న అప్పటి విద్యార్థులు

నల్లగొండ టౌన్, వేములపల్లి, మిర్యాలగూడ టౌన్, మే 19: జిల్లాలోని పలుచోట్ల ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులంతా ఒక్క దగ్గరికి చేరుకొని అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమ పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అదేవిధంగా తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను సన్మానించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

● నల్లగొండ పట్టణంలోని పాతబస్తీలో గల జేబీఎస్ స్కూల్ 1984-85 బ్యాచ్ ఎస్ఎస్‌సీ విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులు దీకొండ వీరయ్య, కె.వెంకట్రాంరెడ్డి, పాండు, శంకర్‌రావులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అప్పటి విద్యార్థులు మందాళపు నరేందర్, బోయపల్లి వెంకటేశ్వర్లు, వి.అంజయ్య, సింగం దుర్గయ్య, ఆవుల సంతోష్, ఇమ్రాన్, గౌస్, ఆనంద్, రాంగోపాల్, పూర్ణచందర్‌రావు, పి.శ్రీనివాస్, ఆర్.నరేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● వేములపల్లి మండలంలోని రావులపెంట జడ్పీ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 2009- 10 విద్యా సంవత్సరంలో పదో తరగతి అభ్యసించిన విద్యార్థులు కలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్‌నాయక్ మాట్లాడుతూ సమాజంలో మంచి పౌరులుగా గుర్తింపు తెచ్చుకోవడం గురువులకు ఎంతో గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యోగీశ్వర్, సత్తార్, గుడిపాటి కోటయ్య, రామచంద్రయ్య, దామోదర్ చారి, దారం శ్రీనివాస్, బచ్చలకూరి సైదులు, మణిభూషణ్‌రెడ్డి, మక్లానాయక్, శ్రీనయ్య, పూర్వ విద్యార్థులు వినోద్, భిక్షం, పుష్ప, రాజేశ్వరి, సాయి, ఇందుమతి, శ్వేత పాల్గొన్నారు.

● మిర్యాలగూడ పట్టణంలోని నవోదయ పాఠశాలలో 1995-96 లో పదో తరగతి అభ్యసించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం స్థానిక వైష్ణవి హోటల్‌లో జరిగింది. కార్యక్రమంలో సూరె వెంకటేశ్వర్లు, భిక్షపతి, ప్రవీణ్‌కుమార్, కవిత, శ్రీనివాస్, జగదీష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



వేములపల్లి, మిర్యాలగూడ పట్టణాల్లో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనాల్లో పాల్గొన్న అప్పటి విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఆసిఫ్‌నహర్ కాల్వ పనులను వేగవంతం చేయాలి


కాల్వ పనులను పరిశీలిస్తున్న రైతులు, కాంగ్రెస్ నాయకులు

శాలిగౌరారం, మే 19: ఆసిఫ్‌నహర్ కాల్వ పనులను వేగవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్ అన్నారు. మండలంలోని తక్కళ్లపహాడ్ వద్ద జరుగుతున్న ఆసిఫ్‌నహర్ కాల్వ పనులను వారు నాన్‌ఆయకట్టు గ్రామాల రైతులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాలిగౌరారం మండలంలోని నాన్‌ఆయకట్టు గ్రామాలైన భైరవునిబండ, తక్కళ్లపహాడ్, ఆకారం, వల్లాల, పెర్కకొండారం గ్రామాలకు ఆసిఫ్‌నహర్ కాల్వ ద్వారా సాగునీరు అందుతుందని అన్నారు. ఎమ్మెల్యే సామేల్ ఇటీవల ఈ కాల్వ నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో కాల్వ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ప్రభుత్వం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కట్టంగూరు మహేందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, తీరుపారి మల్లయ్య, షేక్ ఇంతియాజ్, భూపతి అంజయ్య, బండపెల్లి కొమరయ్య, చింత ధనుంజయ్, నోముల జనార్ధన్, వలిశెట్టి సైదులు, నరిగే నర్సింహ, చెరుకు జానయ్య, పుల్లూరి దేవేందర్, దేవరకొండ జయరాజ్, రంగారెడ్డి, పాకల సతీష్, మహేష్, నరేష్, గణేష్ పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

నల్లగొండ కల్చరల్, మే 19: వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డీవైఎస్‌వో మక్బూల్ అహ్మద్ అన్నారు. జిల్లా యువజన, క్రీడా ప్రాధికారిక సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న స్విమ్మింగ్ పూల్ వద్ద ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. స్విమ్మింగ్ పూల్‌లో స్విమ్మర్స్‌కు డాక్టర్ జయకుమార్ చర్మవ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఇతర ఎలర్జీలపై తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఆర్.కిరణ్‌కుమార్, స్విమ్మింగ్ పూల్ ఇన్‌చార్జి నజీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

డిండిలో వర్షం

డిండి, మే 19: డిండి మండలంలో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో మోస్తారుగా వర్షం కురిసింది. వేసవి ఎండలు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలకు వర్షం ఊరట కలిగించింది.

సంక్షిప్త సమాచారం...

నార్కట్‌పల్లి: సురభి కళాకారులతో నార్కట్‌పల్లిలో నిర్వహించే ప్రతీ నెలా రెండు ఉచిత నాటక ప్రదర్శనలను ప్రేక్షకులు సద్వినియోగం చేసుకోవాలని సురభి శారదావిజయ నాట్యమండలి సంస్థ అధ్యక్షుడు శివశంకర్ తెలిపారు. ఇందులో భాగంగా బాలనాగమ్మ ప్రస్తుతం జానపద, పౌరాణిక నాటకాన్ని ఆకట్టుకునే సెట్టింగులతో ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు.

చిట్యాల: తేనేటీగల దాడిలో గాయపడిన మునిసిపల్ కార్మికురాలు జిట్ట మణెమ్మ కుటుంబానికి బీజేపీ నాయకుడు కూనూరు సంజయ్‌దాస్ గౌడ్ రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గంజి గోవర్ధన్, పల్లె వెంకన్న, అశోక్, ప్రశాంత్ పాల్గొన్నారు.

హాలియా: ఎమ్మెల్సీ ఉపఎన్నికలో ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థి బరిగెల దుర్గాప్రసాద్‌ను గెలిపించాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మామిడి సైదయ్య, జగన్ పిలుపునిచ్చారు. హాలియాలో ప్రచారం నిర్వహించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలందరూ ధర్మ సమాజ్ పార్టీ బలపరిచిన దుర్గాప్రసాద్ మహారాజ్ 11వ నెంబర్‌పై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యకమంలో అనుముల, నిడమనూరు, గుర్రంపోడు, తిరుమలగిరి మండలాల కన్వీనర్లు, రవి, జిల్లా రమేష్, మహేష్, గోవర్ధన్, నాగరాజు, రమేష్, శంకర్, కొండల్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మాడ్గులపల్లి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డిని పట్టభద్రులు అత్యధిక మెజారిటీతో గెలిపించాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పాలుట్ల బాబయ్య కోరారు. నిరుద్యోగుల సమస్యలపై రాకేష్‌రెడ్డి ప్రభుత్వంపై పోరాటం చేస్తారని, ఈ నెల 27వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

కేతేపల్లి: మండలంలోని ఉప్పలపహాడ్ గ్రామానికి చెందిన మారగోని లక్ష్మమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే వేముల వీరేశం లక్ష్మమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే గ్రామంలో ఇటీవల మృతి చెందిన నకిరేకంటి శంకరయ్య కటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాసయాదవ్, నాయకులు జి.మాధవరెడ్డి, మున్న అశోక్, బి.యాదగిరి తదితరులు ఉన్నారు.

మునుగోడు: మండల కేంద్రానికి చెందిన రేవెల్లి సునీత అనే ఒంటరి మహిళ అనారోగ్య కారణాలతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆమెకు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆరెళ్ల సైదులు తనవంతు సహాయంగా రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు.

గుర్రంపోడు: గుర్రంపోడు మండల కేంద్రంలోని మసీదులో మౌలానా ఇంటి నిర్మాణం కోసం వీకేఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత, కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు వెలగపురి కరుణాకర్‌రావు రూ.లక్ష చెక్కును అందజేశారు. గుర్రంపోడు మండల కేంద్రంలోని మసీదు కమిటీ ఆధ్వర్యంలో చెక్కును కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మసీదు కమిటీ సభ్యులు కరుణాకర్‌రావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మైనారిటీ నాయకులు గుండెబోయిన కిరణ్, కట్టెబోయిన విజయ్, షేక్ సయ్యద్ మియా, చాంద్‌పాషా, సులేమాన్, రిజ్వాన్, జానీపాషా, సర్వర్ పాల్గొన్నారు.

మిర్యాలగూడ: తెలంగాణ చేనేత ఐక్యవేదిక యువజన విభాగం చీఫ్ అడ్వైజర్‌గా డాక్టర్ పోశం శివశంకర్ నియమితులయ్యారు. పద్మశాలీ యువతను అన్ని రంగాల్లో అగ్రగామిగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా నూతన కమిటీలను నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ తెలిపారు. ఈ మేరకు శివశంకర్‌ను నియమించినట్లు తెలిపారు.

మునుగోడు: రాష్ట్రంలో కులగణన ప్రక్రియ చేపట్టిన తర్వాత బీసీ రిజర్వేషన్లు 50 శాతానికి పెంచి స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పానుగంటి విజయ్‌గౌడ్, బూడిద మల్లిఖార్జున్‌యాదవ్ డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలు నిర్వహించడం సరైంది విధానం కాదని పేర్కొన్నారు. కులగణన చేపట్టి బీసీలకు రిజర్వేషన్లు అమలుచేసేందుకు చొరవ చూపాలని లేకుంటే బీసీ ఆగ్రహానికి గురవుతారని హెచ్చరించారు. సమావేశంలో కృష్ణ, లింగస్వామి, యాదయ్య, అంజి, శంకర్, మల్లేష్, నవీన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి


శ్రీనివాస్‌రెడ్డి

కొండమల్లేపల్లి, మే 19: కొండమల్లేపల్లి మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఎం.శ్రీనివాస్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలోని సాగర్ రోడ్డులోని ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో టీయూడబ్ల్యూజే నియోజకవర్గ అధ్యక్షుడు గాదె గిరిధర్‌రావు, ఆంధ్రప్రభ సీనియర్ రిపోర్టర్ జూలూరి వెంకటయ్య ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా దుండిగళ్ల అశోక్, సంఘం అధ్యక్షుడిగా ఎం.శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు సయ్యద్‌పాషా, ప్రధాన కార్యదర్శి బూడిద శ్రీనివాస్‌యాదవ్, సహాయ కార్యదర్శి కుంభం యాదగిరిగౌడ్, కోశాధికారి బొమ్మ వెంకటరమణయాదవ్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

అంబేడ్కర్ యూత్ మండల అధ్యక్షుడిగా సతీష్

వేములపల్లి, మే 19: అంబేడ్కర్ యూత్ మండల అధ్యక్షుడిగా మండలంలోని మొల్కపట్నం గ్రామానికి చెందిన రెమడాల సతీష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని మొల్కపట్నం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం తనవంతుగా కృషి చేస్తానని అన్నారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రెమడాల పరశురాములు, రెమడాల భిక్షం, జెర్రిపోతుల యాదగిరి, చంటి, పుట్టల మాదేష్, వల్లమల్ల పరమేష్, ఈట నాగరాజు, జెర్రిపోతుల తిరుమలేష్, కరుణాకర్, సురేందర్, ప్రవీణ్, ఎల్లయ్య, బాలస్వామి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.